## ధ్రువపత్రాల పరిశీలన



అభ్యర్థులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ నాగేంద్రుడు

నారాయణపేట, అక్టోబర్ 13: పట్టణంలోని ఎస్పీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం అదనపు ఎస్పీ నాగేంద్రుడు ఆధ్వర్యంలో జిల్లాలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొత్తం 99 మంది అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించినట్లు తెలిపారు. అభ్యర్థులకు త్వరలో మెడికల్ టెస్టులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శేఖర్‌బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## వాహనాల ముమ్మర తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కోస్గి, అక్టోబర్ 13 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కోస్గి మండల కేంద్రంలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం కోస్గి మండలంలోని కడంపల్లి గేటు సమీపంలో ప్రధాన రహదారిపై వాహనలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనాల్లో రూ. 50 వేలకు మించి తీసుకెళ్లరాదని వాహనదారులకు సూచించారు. రూ.50వేలకు మించి డబ్బు ఉంటే తగిన ఆధారాలు చూపించాలన్నారు.

## తనిఖీల్లో నగదు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న సీఐ రాంలాల్

మక్తల్ అర్బన్, అక్టోబర్ 13 : ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీలను అధికారులు ముమ్మరం చేశారు. శుక్రవారం మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తనిఖీలు చేపడుతుండగా మహబూబ్‌నగర్ జిల్లా కన్మనూర్‌కు చెందిన నాగన్న రాయిచూర్ నుంచి బొలేరో వాహనంలో వెళ్తూ రూ.లక్షా 9 వేలతో పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేకపోవడంతో సీజ్ చేసి జిల్లా ఎలక్షన్ ట్రెజరీకి పంపించినట్లు సీఐ రాంలాల్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రూ.50వేలకు మించి నగదు తరలిస్తే అందుకు సంబంధించిన రసీదులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. తనిఖీల్లో ఎస్సై పర్వతాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### మాగనూర్‌లో...

మాగనూర్, అక్టోబర్ 13 : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా లోకనాథ్ అనే వ్యక్తి బల్లారి నుంచి నారాయణపేటకు కారులో రూ.58,700 తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఎలక్షన్ ట్రెజరీకి పంపించామని తెలిపారు.

# ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు నిబంధనలు పాటించాలి

- కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట, అక్టోబర్ 13: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్ని విభాగాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని కలెక్టర్ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో స్టాటిస్టిక్ సర్వేలైన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్, వీడియో సర్వేలైన్స్, వీడియో వీవింగ్, ఎంసీసీ బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా అన్ని బృందాలు విధుల్లో చురుగ్గా ఉండాలన్నారు. అకౌంట్ రిజిస్టర్ల నిర్వహణ, షాడో రిజిస్టర్ల నిర్వహణ, అభ్యర్థుల వ్యయానికి సంబంధించి రిజిస్టర్ల నిర్వహణ పూర్తి స్థాయిలో చూడాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు వీడియో సర్వేలైన్స్ బృందాల విధులకు సంబంధించిన వీడియోలు పరిశీలించి ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరిగితే రిటర్నింగ్ అధికారి దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కమ్యూనిటీ హాల్స్, ఫంక్షన్ హాల్, మ్యారేజ్ హాల్స్‌ను తనిఖీ చేసి ఎన్నికలకు సంబంధించి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుంటే వెంటనే సమర్పించాలన్నారు. లౌడ్ స్పీకర్లు 10గంటల తర్వాత వినిపిస్తే కేసులు నమో దు చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మయాంక్ మిట్టల్, అశోక్‌కుమార్, ఆర్డీవో రాంచందర్, ఎస్‌డీసీ రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

### నగదు పట్టుబడితే ఆధారాలు అందజేయాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 13: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా రూ.50వేలు పైబడి నగదును అధికారులు సీజ్ చేస్తే ఆడబ్బుకు సంబంధించిన వారు వారంలోపు కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీకి వివరాలు అందజేయాలని కలెక్టర్ శ్రీహర్ష శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆధారాలు చూపని పక్షంలో నగదును ఆదాయ పన్ను శాఖ వారికి అప్పగించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ కమిటీలో జెడ్పీ సీఈవో జ్యోతి, కో ఆపరేటివ్ అధికారి కోదండరాములు, జిల్లా కోశాధికారి యాదగిరి ఉంటారని పేర్కొన్నారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

- అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్
- గురుకుల జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం



జ్యోతి వెలిగించి క్రీడలను ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ మిట్టల్

మరికల్, అక్టోబర్ 13 : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో ముఖ్యమని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సంయుక్త కార్యదర్శి నిరూప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 9వ జోనల్ పోటీలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో విద్యార్థులు చదువులో ముందున్నారని, క్రీడాల్లో కూడా జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. నారాయణపేట, గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లాలోని 11 గురుకుల పాఠశాలల నుంచి 935 మంది విద్యార్థులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనడం హర్షణీయమన్నారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. 9వ జోనల్ స్థాయి పోటీలను మరికల్ మండలంలో ప్రారంభించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు క్రికెట్, పుట్‌బాల్, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, కబడ్డీ, టెన్నిస్ తదితర పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నాలుగు రోజుల పాటు నిర్వహించే క్రీడల్లో విద్యార్థులు తమ సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో ప్రాంతీయ సమన్వయ అధికారి ఫ్లోరెన్స్‌రాణి, సమన్వయ అధికారులు దేవసేన, శ్రావణి, మరికల్ ప్రిన్సిపాల్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ అర్చన, ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.




మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారిణులు

# నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

కోయిలకొండ, అక్టోబర్ 13:మండలంలోని నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో జయ రాం సిబ్బందికి సూచించారు.శుక్రవారం మండలంలోని రాంపూర్‌లోని నర్సరీని ఆయన పరిశీలించి మొక్కల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని మొక్కలకు ప్రతి రోజూ నీరు పట్టాలని సూచించారు. నర్సరీలో మొక్కల వివరాలను అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీవో నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయరాం

## రేపటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు



శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబైన శక్తిపీఠం

నారాయణపేట టౌన్, అక్టోబర్ 13: పట్టణంలోని శక్తిపీఠంలో ఈనెల 15 నుంచి శరన్నవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు శాంతానంద్ పురోహిత్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలను పురస్కరంచుకొని అన్ని ఏర్పా ట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారికి విశేష పూజలు, సామూహిక కుంకుమార్చన, సామూహిక అక్ష్యరాభ్యాసం, అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమాలు నిర్వహించన్నుట్లు తెలి పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## 20న జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు

నారాయణపేట టౌన్, అక్టోబర్ 13: పట్టణంలోని మినీ స్టేడియం లో ఈనెల 20న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో ఈ ఎంపికలు ఉంటాయన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25, 26 తేదీల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాల ఆవరణలో జరిగే 9వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు కుల, జనన ధ్రువీకరణ పత్రాలు, ఎస్‌ఎస్‌సీ మెమోలతో హాజరు కావాలన్నారు. మిగతా వివరాలకు 90593 25183, 9063500718, 6303339022, 8499968852 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## అల్పాహారం పంపిణీ

నారాయణపేటరూరల్,అక్టోబర్13:పేట జిల్లా కేంద్రంలోని దవాఖాన వద్ద శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఆర్టీవో వీరస్వామి, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణభట్టడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత దృక్పథంతో సమాజంలో సాటి మానవులకు ఆకలిని తీర్చిన వారు దైవ సమానులన్నారు. ప్రతి ఒక్కరూ సేవా భావం అలవర్చుకోవాలని దీని వల్ల మానవ జన్మకు సార్థకత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటయ్య,సాయినాథ్,కోశాధికారి రవిగౌడ్, సభ్యులు జనార్దన్, శ్రీనివాస్‌లాహోటి, ఆత్మరాం, కె.విజయ్‌కుమార్, సత్యనారాయణ, సదానంద్‌చారి పాల్గొన్నారు.